బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వెల్టూరులో మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : మండలంలోని వెల్టూరు గ్రామంలో కావలి భాగ్యమ్మపై గోడ కూలీ ప్రమాదవశాత్తు ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం కల్పించారు. మృతురాలి భర్త నాగన్న కుటుంబంతో న్యాయవాది వృత్తిలో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, తండ్రిని బాగా చూసుకోవాలని నాగన్న కుమారులకు మాజీ మంత్రి సూచించారు. అనంతరం వెల్టూర్, కన్మనూరు, బలీదుపల్లి గ్రామాల బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించి సాగునీరుకు సంబంధించి, రాజకీయ అంశాలపై ఆరా తీశారు. పార్టీ నాయకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణు యాదవ్, నాయకులు సు రేశ్, కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, భీంరెడ్డి, ద యాకర్, రఘువర్ధన్‌రెడ్డి, యాదయ్య, కుర్మన్న, ఖాజాహుస్సేన్, సర్వేశ్వర్‌రెడ్డి, అంజి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను హుందాగా స్వీకరించాలి

- బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు

ఇందువాసిలో కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు

గట్టు, డిసెంబర్ 27 : గెలుపోటములను హుందాగా స్వీకరించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు అన్నారు. మండలంలోని ఇందువాసిలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటుచేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పండుగలు, జాతరలు, ఉర్సుల సందర్భంగా మండల కేంద్రాలతోపాటు పల్లెల్లో గ్రామీణ క్రీడలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పోటీల్లో క్రీడాకారులు రాణించి రాటుదేలాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలాల్లో క్రీడామైదానాలను ఏర్పాటుచేసి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చిందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుల్లయ్య, నాయకులు నూర్‌పాషా, రామునాయుడు, బాసు బొజ్జయ్యనాయుడు, నల్లారెడ్డి, నరేశ్, లోకేశ్, తిమ్మన్న, భీమన్న, ఆంజనేయులు, భీమేశ్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిజమైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఇంకా చాలా మంది అప్లికేషన్లు ఇవ్వని వారు ఉన్నారని, అందుకని ప్రతి ఇల్లు తిరిగి నిజమైన నిరుపేదలను గుర్తించి వారి నుంచి కూడా అప్లికేషన్లు తీసుకోవాలన్నారు. ప్లాట్ ఉన్న వారి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని, ప్లాటు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పట్టణంలో రోడ్ల విస్తరణ పూర్తిచేసి విస్తరణలో నష్టపోయిన వారందరికీ నష్టపరిహారం ఇవ్వాలని, పాత బస్టాండ్‌ను పునఃప్రారంభించాలని, శ్మశాన వాటిక కోసం రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీపీఎం నాయకులు పరమేశ్వరాచారి, కుర్మయ్య, బాలస్వామి, గంధం గట్టయ్య, రమేశ్, బీసన్న, సాయిలీల, ఉమా, కవిత, రత్నయ్య, లక్ష్మి, శ్యామల, రాములు, రాబర్ట్, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలకు ఎంపికైన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ధరూరు, డిసెంబర్ 27 : రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈడీ శ్రీనివాసులు తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొనడానికి జిల్లా జట్టుతో కలిసి బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను జీహెచ్‌ఎం ప్రతాపరెడ్డి అభినందించి, ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

బోనమెత్తిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలలో బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

వనపర్తి రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

గద్వాలటౌన్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని స్మృతి వనం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా ఎస్ఎస్ఏ మహిళా ఉద్యోగులు బోనాలు ఎత్తారు. ఈ సందర్భంగా బోనాలతో ఉద్యోగులు పట్టణ ప్రధాన రహదారుల గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుంకులమ్మ ఆలయంలో బోనాలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. ఉద్యోగుల సమ్మెకు పీఈటీలు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఉద్యోగుల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు కృష్ణయ్య, భరత్‌లతో పాటు ఎస్ఎస్ఏ ఉద్యోగులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలో..

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో, దీక్ష శిబిరంలో భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మాట్లాడుతూ మినీమం టైం స్కేలు, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అన్నారు. శుక్రవారంతో 23వ రోజుకు నిరసన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, బాలగోవింద్, లోహితరెడ్డి, శ్రీధర్, వెంకటేశ్, శేఖర్‌నాయక్ ఉన్నారు.

ఆర్థిక సంస్కరణల అమలులో మన్మోహన్‌సింగ్ నిపుణుడు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, డిసెంబర్ 27: దేశం ఆర్థికంగా క్లిష్టసమయంలో ఉన్నప్పుడు మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థిక రంగ నిపుణిడిగా మన్మోహన్‌సింగ్ తన విధులను సక్రమంగా నిర్వహించి పీవీ నరసింహారావు మనసు గెలిచిన గొప్ప వ్యక్తి అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధాని మృతిపై ఎమ్మెల్యే సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, కౌన్సిలర్లు దౌలు, కృష్ణ, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామకృష్ణనాయుడు, కుర్మన్న, ధర్మనాయుడు, గంట రమేశ్, గోవిందు,రామకృష్ణ, ఉరుకుం దు,యుగంధర్‌గౌడ్, నాగార్జున, గణేశ్, రాజు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ఎమ్మెల్యే వినతి

గద్వాల అభివృద్ధికి సహకరించాలని కేంద్రహోంసహాయ శాఖ మంత్రి బండి సంజయ్‌ను గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు.శుక్రవారం కర్ణాటకలోని రాయిచూర్ జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్‌యూనివర్సిటీ అతిథిగృహంలో కేంద్ర మంత్రిని ఎమ్మెల్యే కలిసి జిల్లా కేంద్రంలోని నవోదయపాఠశాలతో పాటు సైనికస్కూల్, కేంద్రీయ విద్యాలయం, గట్టులో ట్రామాకేవ్ సెంటర్‌ను మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. గద్వాల-రాయిచూర్ రోడ్డును నాలుగు లేన్ రహదారిగా విస్తరించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా

తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్‌సింగ్ పాత్ర కీలకం

వనపర్తిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ఆమోదించిన ఆర్థిక అసమాన్యులు మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వనపర్తిలో వేర్వేరుగా..

జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. మేఘారెడ్డి వర్గీయులు రాజీవ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించగా, చిన్నారెడ్డి వర్గీయులకు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీశ్, వలీ, ప్రకాశ్, పరశురాం, కోళ్ల వెంకటేశ్, చీర్ల జనార్దన్, నందిమల్ల యాది, చంద్రమౌళి, ఎల్ఐసీ కృష్ణ, చంద్రకళ ఉన్నారు.

పోగొట్టుకున్న డబ్బులు రికవరీ

- బాధితుడికి అప్పగింత

గోపాల్‌పేట, డిసెంబర్ 27 : పోగొట్టుకున్న డబ్బులు రికవరీ చేసిన పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రామస్వామి అతడి భార్య ఇద్దరు కలిసి గురువారం మండలకేంద్రంలోని కల్లు దుకాణంలో కల్లు తాగి తమ వద్ద ఉన్న రూ. 70వేలు అక్కడే మరిచి వెళ్లిపోయారు. కొంత సేపటి తర్వాత డబ్బులు గుర్తుకు రాగా, కల్లు దుకాణం వద్దకు వెళ్లి వెతికారు. కనిపించకపో వడంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా డబ్బులు తీసుకెళ్లిన వారిని గుర్తించి, వారి నుంచి డబ్బులు రికవరీ చేసి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కిశోర్

అయిజ, డిసెంబర్ 27 : క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని బీఆర్‌ఎస్ యువజన నాయకులు కిశోర్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, ఆనంద్‌రాజు, రాముడు, శాస్త్రి మునిస్వామి, చిన్న యాదవ్, తిరుమల్, వీరేశ్, వెంకట్రాములు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల చివరి వరకు సర్వే పనులు పూర్తి చేయాలి

మల్దకల్, డిసెంబర్ 27 : మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులు ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి ఆదేశించారు. మండలంలోని పెద్దపల్లి, అమరవాయి, మల్దకల్, నేతువానిపల్లి, తండా,ఉల్గెపల్లి, బిజ్వారం తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రాజశేఖర్, కార్యదర్శులు ఉన్నారు.

బలిజపల్లిలో కొనసాగుతున్న నిరసన

నిరసన దీక్ష చేపడుతున్న బలిజపల్లి గ్రామస్తులు

పెద్దమందడి, డిసెంబర్ 27 : బలిజపల్లి గ్రామ పంచాయతీ విలీనాన్ని విరమించుకోవాలని చేపడుతున్న గ్రామస్తుల నిరసన దీక్ష శుక్రవారం కొనసాగింది. ముందుగా భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జయంతి మాట్లాడుతూ బలిజపల్లి గ్రామ పంచాయతీ విలీనం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేర్వేరు గ్రామ పంచాయతీలుగా కొనసాగితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటయ్యాకే గ్రామం అభివృద్ధిలో పురోగతి సాధించిందన్నారు. బలిజపల్లి గ్రామ పంచాయతీ విలీనాన్ని వెనక్కి తీసుకునే వరకు నిరసన దీక్షలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశ్వత్థామారెడ్డి, శివవర్ధన్‌రెడ్డి, గిరిజ, సంజీవరెడ్డి, నాగరాజు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపడుతున్న సీఐటీయూ నేతలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 24 : జిల్లావ్యాప్తంగా నెలకొన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 5నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని టోకెన్ సమ్మె చేపట్టినట్లు చెప్పారు. అనంతరం పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మండ్ల రాజు, టీ యూసీఐ నాయకులు గణేశ్, గ్రామ పంచాయతీ కార్మికులు ఉన్నారు.

ఇక 24 గంటలపాటు అందుబాటులో అమ్మ ఒడి

- 102 సేవల జిల్లా అధికారి రత్నమయ్య

పెబ్బేరులో 102 వాహనాన్ని తనిఖీ చేస్తున్న రత్నమయ్య

పెబ్బేరు, డిసెంబర్ 27: ఇప్పటి నుంచి 102 అమ్మ ఒడి సేవలు 24 గంటల పాటు అందించనున్నట్లు 102 సేవల జిల్లా అధికారి రత్నమయ్య తెలిపారు. శుక్రవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 102 అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పగలు మాత్రమే సేవలందించే 102 వాహనాలు ఇక నుంచి రాత్రి పూట కూడా అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. అమ్మ ఒడి సేవలను మరింత విస్తృత పరచడంలో భాగంగానే అంబులెన్స్‌లను 24 గంటల పాటు అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రతి గర్భవతిని దవాఖానకు తీసుకొచ్చి పరీక్షల అనంతరం వారిని ఇంటి వద్ద వదిలిపెట్టడం జరుగుతుందన్నారు. కాన్పు అయిన తర్వాత ప్రసూతి మహిళను ఇంటి వద్ద దింపడం, పుట్టిన పిల్లలకు టీకాలు వేయించి తీసుకరావడం 102 అమ్మ ఒడి అంబులెన్స్‌ల విధులన్నారు. పగలే గాకుండా, రాత్రిపూట కూడా రోగులకు సేవలందించేందుకు వీటిని సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అత్యవసర సమయాల్లో 102 సేవలను వినియోగించుకోవాలని రత్నమయ్య విజ్ఞప్తి చేశారు.

కోర్టు నిర్మాణాన్ని పీజేపీ క్యాంప్ ఆవరణలో చేపట్టాలి



బండి సంజయ్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

గద్వాలటౌన్/ గద్వాల అర్బన్, డిసెంబర్ 27: జిల్లా కేంద్రంలోని పీజేపీ స్థలంలో కోర్టు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాదులు కేంద్రమంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. బీజేపీ కార్యాలయంలో ఆయనను న్యాయవాదులు కలిసి సమస్యను వివరించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించారు. పీజేపీ స్థలంలో నిర్మాణం చేపడితే అందరికీ సౌలభ్యంగా ఉంటుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రిలే దీక్షలో భాగంగా శుక్రవారం కోర్టు ఎదుట వంట వార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ చేపట్టి నిరసనకు అఖిల పక్ష నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రఘురాంరెడ్డి, ఇస్మాయిల్, ఖాజామైనుద్దీన్, మల్లెందొడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలి

గట్టు, డిసెంబర్ 27 : చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని నిర్వాసితులు జిల్లాకేంద్రంలోని డీకే బంగ్లాలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిప త్రాన్ని శుక్రవారం అందజేశారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌తో తమకు ఒరిగిందేమిలేదని, ఏండ్లుగా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నిర్వాసితులు తెలిపారు.

నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయాలి

గద్వాల అర్బన్, డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయాలని, ఇన్‌కంటాక్స్ పరిధిని పెంచాలని కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన బండి సంజయ్ కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ ఇన్‌కం టాక్స్ మినహాయింపు పరిధి నుంచి రెండు రీజియన్లలో రూ.5 లక్షల వరకు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, మనోహర్‌రెడ్డి, సురేశ్, రవీందర్ రెడ్డి, అయ్యస్వామి ఉన్నారు.

ఆరునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అమరచింత, డిసెంబర్ 27 : ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న 104 ఉద్యోగుల వేతనాలను వెంటనే చెల్లించాలని 104ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు రాజు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విధుల్లో నల్లబాడ్జీని ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104ఉద్యోగులకు ప్రభుత్వం ఆరునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఒక పూట భోజనంతో గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 4 తేదీ వరకు 706 జీవో నెంబర్‌ను విడుదల చేస్తూ రూ.12కోట్ల 56లక్షల నిధులు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ ఉద్యోగులకు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేసినా మా మొర పట్టించుకోకపోవడంతో నిరసన చేపడుతున్నామని, ఇప్పటికైనా తమకు వేతనాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపీ మందకు పరామర్శ

అయిజ, డిసెంబర్ 27 : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథంను సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో అనారోగ్యంతో చికిత్స పొందుతుడడంతో శుక్రవారం ఆయన నిమ్స్‌కు చేరుకొని మంద ఆరోగ్యంపై బీఆర్‌ఎస్ అలంపూర్ మాజీ ఇన్‌చార్జి మంద శ్రీనాథ్‌ను అడిగి తెలుసుకొన్నారు. భగవంతుడి ఆశీస్సులతో ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

30న ఉద్యోగా మేళా

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలో ఈనెల 30వ తేదీ సోమవారం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి మహ్మద్ జానీపాషా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదు ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసేందుకు 460ఉద్యోగాల ఖాళీల భర్తీ కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ పాసై, ఐటీఐ ఎలక్ట్రిషన్, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, ఫార్మసీ తదితర చదివిన వారు 18నుంచి 35 ఏండ్ల వయసులో ఉన్న వారు అర్హులన్నారు. ఆధార్, బయోడేటా ఫొంతో పీఎం కిసాన్ సెంటర్ రామాలయం సాయినగర్ కాలనీలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. పోస్టును బట్టి రూ.9వేల నుంచి రూ.30వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు. వివరాలకు 9948568803, 9550205227 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా సేవలు

గోపాల్‌పేట, డిసెంబర్ 27 : భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) వారి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా సేవలందిస్తాయని ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏపీజీవీబీకి సంబంధించి విలీన ప్రక్రియలో భాగంగా నేటి నుంచి ఈనెల 31 వరకు అన్ని ఆన్‌లైన్ సేవలు (మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం, బ్యాంక్ మిత్ర) అందుబాటులో ఉండవని తెలిపారు. జనవరి 1వతేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కాంగ్రెస్‌లో పనిచేసేవారికి సముచిత స్థానం లేదు

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం లేదని ఎం.డీ నిరంజన్ బాబా విమర్శించారు. శుక్రవారం ఆయన తీవ్ర మనస్థాపంతో విలేకరులతో మాట్లాడుతూ తన ఆవేదనను వెల్లిబుచ్చాడు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించానని తెలిపారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ అనేక విభాగాల్లో నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం 18 ఏండ్లు పనిచేసినా ఎలాంటి పదవీ లభించలేదని, పార్టీ విభాగాల్లో పనిచేస్తూ అధికారం ఉన్నా, లేకపోయినా కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశానని మనోవేదనను వెల్లిబుచ్చాడు. పార్టీ ఏ కార్యక్రమం చేపట్టిన ముందుండి నడిపిస్తున్నానని అధికారంలోకి వచ్చాక పార్టీ ద్వారా వచ్చే పదవులకు మేము అర్హులం కాదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేయని నాయకులకు పదవులు వస్తున్నాయని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా చాలాకాలం నుంచి పనిచేస్తున్న కోర్టులో ఏజీపీ పదవీ ఆశించానని ఆ పదవీ రాకపోవడం తీవ్ర మనస్థాపానికి గురయ్యానని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గుర్తించి కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు సరైన పదవులు ఇచ్చి సముచిత న్యాయం చేయాలని కోరారు.

4,5తేదీల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

గద్వాలటౌన్, డిసెంబర్ 27 : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిచెందడంతో ప్రభుత్వం శుక్రవారం ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించింది. ఆ మేరకు డిసెంబర్ 27, 28వ తేదీల్లో నిర్వహించాల్సిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను వాయిదా వేసినట్లు డీఈవో మహ్మద్ అబ్దుల్‌గని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రదర్శన వచ్చే నెల 4, 5వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో పాల్గొనే వరకు 2వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

అలంపూర్, డిసెంబర్ 27 : మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన కుమ్మరి మంగమ్మ అనారోగ్యానికి గురై మెరుగైన వైద్య సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి రూ.26 వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం టెలీకాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఇస్మాయిల్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, సురేశ్‌రెడ్డి, కుర్వ గోపాల్, అంజి, మధు పాల్గొన్నారు.

గద్వాలకు తరలిన అఖిలపక్ష కమిటీ నాయకులు

అయిజ, డిసెంబర్ 27 : పీజేపీలోనే కోర్టు సముదాయం నిర్మించాలనే లక్ష్యంతో న్యాయవాదులు చేపట్టిన దీక్షకు మద్దతుగా శుక్రవారం అయిజ మండల అఖిలపక్ష కమిటీ నాయకులు తరలివెళ్లారు. న్యాయవాదులు చేపట్టిన దీక్షకు మద్దతు ప్రకటిస్తూ దీక్ష చేపట్టినట్లు అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసమే కోర్టు సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.